# అవసరంలేని ఆపరేషన్

ఆ బాణసంచా హడావిడి యేమిటి ?"

"టీపార్టీ."

"యెవరికి ?"

"యీ వూరు ఆడడాక్టరికి బదిలీ అయింది."

"యింత ఆడంబరంగానా ?"

'యీ వూరి ప్రజలకు ఆమె నిస్తే అత్యంత అభిమానం."

"యెందుకో ?"

"ఐదేళ్లలోనూ వాళ్లని పది వేల రూపాయలు బ్యాంకులో వేసుకుంది. అందుకని"

"అంత తెలివి లేదా ?"

"లేనేమో! మొదటి సంవత్సరం ఆమె మొహం చూసినవాడు లేడు. కానీ ఆ జూలైలో గావును ఒక విచిత్రమైన కేసు తగిలింది. దాంతో ఆమె ప్రభ దిగ్విజయంగా వెలిగింది, యీ నాలుగేళ్లూ"

"యేం కేసేమిటి?"

"అదే తమాషా, అందులో యీమె ప్రయోజకత్వమేమీ లేదు. కీర్తి మాత్రం యీమెకి దక్కింది. వాళ్లు మాకు బంధువులే. చెప్పనా? ఆమెకి ముప్పైయేళ్లు—"

"డాక్టరుకా ?"

"కాదు. మా బంధువురాలావిడకి. ఆమెకి పిల్లలు లేరు. పిల్లలు లేకపోతే బతుకెందుకనే మనోవ్యాధి పట్టుకుందామెకి. యింక బిడ్డల కోసం వాళ్లుపడ్డ శ్రమా, చేసిన ప్రయత్నాలూ యిన్నన్ని కాదు. యెన్ని మందులో, యెన్ని యాత్రలో, యెన్ని విధాలైన ప్రదక్షిణాలో, యెంత మంది బైరాగులకీ, సన్యాసులకీ బహుమతులో! యేమీ లాభంలేక, ప్రతి రోజూ ప్రతివారితో తన కథ చెప్పుకుని యేడుస్తూ పడివుంది. చిన్నదానివి, యింకా నీకింత తొందరేమిటి, నిరాశ యేమిటంటే వినదు. చివరికి ఒక పిల్లాణ్ణి తెచ్చి పెంచుకుంటే, వాడు యీ ముద్దులు భరించలేక పారిపోయి

నాడు. తరవాత చెన్నపట్నంనుంచి పెద్ద బొమ్మ నొకదాన్ని తెచ్చుకుంది. ఆ బొమ్మకి పాలిచ్చీ, ముద్దాడీ, నీళ్ళుపోసీ చొక్కాలు తొడిగీ, అది చేతులూ కాళ్ళాడించాలనీ, యేడవాలనీ, మాట్లాడాలనీ, ఆమెచేసే ప్రయత్నం, చూస్తే అందరికీ అమితమైన జాలి కలిగేది. మా బంధువుల్లో పిల్లలులేని దరిద్రు లెవరూలేరు. కనుక యీమె సిగ్గుపడి, పిల్లలులేనిపాపం చేసినట్లు యే కార్యాలకీ యెక్కడకీ వెళ్ళడం మానేసింది యెవరు తన యింటికి వచ్చినా, వాళ్లు తనని హేళనచేస్తున్నారే అనుకుంది. పిల్లలకోసం యీమె చెయ్యడానికి నిరాకరించే పనివుందా అనిపించేది. యింతలో ఆ వూళ్ళో స్వాములాగ్లమీది గొప్పస్వాములవారు వొచ్చారు. గొడ్రాళ్ళకి పిల్లలు పుట్టించడంలో ఆయన బహునేర్పరి. గుంపులు గుంపులుగా ఆడ వాళ్ళాయన్ని దర్శించి కృతార్థు లౌతున్నారు. ఒక్క వితంతువులు మాత్రం, ఆయన గాలి తగిలితే, తమకే వుపద్రవం కలుగుతుందో అని దూరాన తప్పుకొంటున్నారు. సరే, యీమె ఆయన దర్శనానికి వెళ్ళింది. పదిహేను రోజులలో గర్భిణీ చిన్నాలు కనపడ్డాయి, వేవిళ్ళు మొదలైన సంగతులన్నీ సక్రమంగా జరిగాయి. యింక వుత్సవాలేమిటి? సూడిదలూ, వొచ్చే బంధువులూ, పోయే బంధువులూ, పదినెలలూ ఒకటే గొడవగా గడిచింది. పదినెలలూ దాటాయి; కనలేదు. సంవత్సరమయింది కడుపు అట్లానేవుంది. వాళ్ళకి భయమేసి యీ డాక్టరుగ్గిరికి తీసుకొచ్చి చూపారు. ఆమె పరీక్షచేసి అది కడుపుకాదని రూఢిగాచెప్పింది. ఆమాట వినగానే పాపం యీపిల్ల మూర్ఛపోయింది. బంధువులంతా గొల్లుమని యేడ్చారు. వారంరోజులు మందిచ్చేటప్పటికల్లా పొట్ట కాస్త.కరిగిపోయింది. ఇట్లా పది నెల్ల గర్భిణీని, వారంరోజుల్లో మాయంచెయ్య శక్తిగలిగిన డాక్టరు, తిరిగి దాన్ని నిజంగా రప్పించలేదా అనే గట్టి విశ్వాసం వాళ్ళకు కుదిరింది. ఆమె తనకి చాతకాదు, మొర్రన్నా వాళ్ళు కదలలేదు. ఒకరోజురాత్రి యీమె పోయి డాక్టరు కాళ్ళమీదపడి బతిమాలుకుని తనకి సంతానం కలిగిస్తే పది హేనువందల కాసులపేరు యిచ్చేస్తానంది.

ఈ డాక్టరు భర్త బి. య్యే. పాసై ఎండాకాలపు శలవలకి యీమె యింటో వున్నాడు. ఒకరోజు భార్య ఆస్పత్రికి వెళ్ళినప్పుడు యీ

అమ్మాయివొస్తే నవ్వి చెయ్యి పట్టుకుని దగ్గిరికి లాక్కున్నాడు. ఈ అమ్మాయి చాలా పూర్వాచార పరాయణురాలు. దైవభక్తిలో, భర్తసేవలో, పెరిగిన మనిషి, పరపురుషుల ధ్యానం యింతవరకు లేదు. అట్లాంటిది బలవంతాగా తటస్థించినా చాల ఘోరపాపమని జంకుతుంది. అతనిపైని గౌరవించాతా, భయించాతా, యేమీ అనకపోయినా అతన్నించి తప్పించుకుని, ఒక్కమాటు మాట్లాడకుండా వెళ్ళిపోయింది. మళ్ళీ వొంటరిగా ఆయింటికి వెళ్ళలేదు. కాని అతనికిమాత్రం ఈమెమీద మమకారం యేమాత్రమూ వదలలేదు.

మర్నాడు ఆపరేషన్ నిశ్చయ మయింది. ఆ సాయంత్రం ఆ అమ్మాయి భయంతో డాక్టరింటో యేడుస్తూ కూచుంది. తన భార్య పక్కగదిలోకి వెళ్ళినప్పుడు, ఈమెతో "పూరికే యేడవకు-ఈ డాక్టర్లకేం తెలుసు — ఈ ఆపరేషన్ లేకుండా అనేక మందులున్నాయి - మళయాళంలో శాక్తగంలో అనేక క్రియలున్నాయి—అవి నాకు తెలుసు—డాక్టరాస్పత్రికి వెళ్ళిం తరవాత రా చెపుతాను" అన్నాడతను—ముందు వేళాకోళ మనుకుంది. కాని ఆలోచించగా, ఒకవేళ అతని కేదన్నా మంత్రం తెలిసివుండకూడదా అని తట్టింది, ఆపరేషనంటే ఆమెకున్న మహాభయమూ, బిడ్డమీద ఆపేక్షా ఆమె విశ్వాసాన్ని మరింత బలపరిచాయి. ఇంటికివెళ్లి భర్తతో చెపితే, తప్పకుండా వెళ్లి కనుక్కోమన్నాడు-ఆమె రాగానే, డాక్టరుభర్త కూచో పెట్టి ఈ సంగతులు మాట్లాడాడు.

''ఈ పిల్లలు పుట్టకపోవడము, నీ లోపమూ కాదు, నీ పూర్వజన్మ లోపమూ కాదు. దేవుడికి నీమీద ఆగ్రహమూ కాదు—లోకంలో గడ్డిపరకలకి వెయ్యిగింజలూ, ఈగలకి లక్షగుడ్లూ ప్రసాదించే ఈశ్వరుడు నిన్ను గొడ్రాలి చెయ్యాలని వుద్దేశ్యపడతాడా? లోకమంతా జననీప్రేమతో మోగిపోతూవుంటే "బిడ్డో!" అని యేడ్చే నీకు బిడ్డలు లేకపోవడ మేమిటి? పోనీ, నీ దేహంలో రుగ్మతవుందా? యేమీలా లేదు. కోపం తెచ్చుకోకు, లోపమంతా నీ భర్తది. ఆయన వంశంలో పిల్ల లెక్కువమంది వుండరు—అవునా?"

"మరి ఆయనకి ఆపరేషన్ చెయ్యాలా?"

"లాభం లేదు."

"ఐతే యెట్లా?"

"యెట్లానూ లేదు."

"ఏదో చెప్తామన్నారు, మరి!"

"మరి చెపితే కోపం తెచ్చుకోవుకద!"

"చెప్పండి"

"నీకు ఆవు వుందనుకో, దానికి దూడకావాలి. ఒక యెద్దు దగ్గర యెదకాకపోతే ఏంచేస్తారు?" సిగ్గుతో మాట్లాడలేదు

"చెప్పుమరి! యింకో యెద్దుదగ్గిరికి తోల్తారు అంతే."

మాట్లాడకుండా కూర్చుంది స్తంభించిపోయి.

"నేను చెప్పేమాట విను. నీకు పిల్లలంటే వెర్రి. పిల్లలు లేకుండా బతకలేవు. గంపెడు పిల్లల్ని కడుపారా కనేందుకు నిన్ను నీ శరీరాన్ని, నీ మాతృహృదయాన్ని సృష్టి ఏర్పరిచింది. అందుకే యీ బాధ. నీకు పిల్లలూ, వారిమీది ప్రేమా, స్త్రీకి జన్మహక్కు, సహజం. అవే స్త్రీ జీవితానికి మకుటాలు. అవిలేక జీవితం శుష్కం, అర్థహీనం. అందుకునే యెంత అణుచుకుందామని ప్రయత్నించినా అణగని ఆబాధ నీకు. యింక ముందు యింకా బాధపడతావు. ఈ యాత్రలూ, మంత్రాలూ, ఆపరేషన్లూ యేంలాభం? ఆయన్ని మార్చవుకదా?"

"ఆయనకేమీ జబ్బులేదే?"

"లేదు. కాని యిదే జబ్బు."

"యేది?"

"నీకూ ఆయనకీ జత కుదరలేదు."

"ఐతే."

"జత కుదుర్చుకోవాలి."

"అంటే?"

"వేరే పెళ్ళిచేసుకోవాలి—"

"ఆయన చేసుకునేం లాభం?"

"ఆయనకాదు నువ్వు—"

"నేనా? పెళ్ళా?"

"పెళ్ళంటే పల్లకీలో వూరేగడం కాదు. యింకో భర్తని బిడ్డలకోసం మాత్రం—" మధ్యనే "ఛాండీ" అని లేచింది.

"ఆ కోపమే వొద్దన్నాను. బిడ్డల్ని యెత్తుకోకుండా, ఆడించకుండా వాళ్ళ ముద్దులు చూడకుండా వుండగలవా? వెర్రిది. ఒక్కమాట విను. మా అబ్బాయిని చూశావుగా! అట్లాంటివాడు పుడితే! మేము సంతానాలకి ప్రసిద్ధి. మాగాలి తాకితేచాలు. మేము పన్నెండుగురం మా తల్లికి. మాలో ఒక్కొక్కరికి నలుగురు పిల్లలకన్న తక్కువలేరు."

వెళ్ళిపోయి, రాత్రంతా ఆలోచించుకుంది. మర్నాడు సాయంత్రం డాక్టరు భర్త టెన్నిసుకి వెళ్తూ వుండగా, ఆమె గుమ్మంలో సిగ్గుతో యెదురయ్యింది. ఆ సాయంత్రానికి ఆమెతో ఇంటోనే వుండిపోయినాడు......

ఆమె ఆపరేషన్ మానేసి తన వూరు వెళ్ళింది, మూడు రోజుల తరువాత. యేడాదైన తరవాత ఎర్రని పాపాయి నెత్తుకుని వొచ్చింది, డాక్టరు దగ్గిరికి—ఆ అమ్మాయి భర్త చాలా సంతోషంతో, గర్వంగా—"ఆపరేషన్లన్నారు. ఒక వంద వొద్దిలేవి! యేమి లేకుండానే యెట్లాంటి పిల్లవాడు కలిగాడో? ఈశ్వరుడి దయవుంటే యేమన్నా జరుగుతుంది" అన్నాడు.

డాక్టరు, భర్తని పిలిచింది. "చిన్నప్పుడు మన పెద్దఅబ్బాయి అచ్చు యిట్లానే వుండేవాడు కదూ?" అంది.

డాక్టరుకి ఆ అమ్మాయి భర్త ఒక చీర యిచ్చాడు. డాక్టరు భర్తకి బంగారపువాచీ గొలుసూ యిచ్చింది, ఆ అమ్మాయి. అప్పట్నించి ఈమె కీర్తి దివ్యంగా వెలిగింది.